సాక్షి
విశాఖపట్నం
సోమవారం । 24 । మార్చి । 2025

ఐపీఎల్ జోష్

నేడు లక్నో సూపర్ జెయింట్స్‌తో ఢిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్




నువ్వానేనా: కెప్టెన్ల మాటామంతి


డీసీ ముమ్మర సాధన

విశాఖకు క్రికెట్ పండగ వచ్చేసింది. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఐపీఎల్ మ్యాచ్‌లకు నగరం సర్వం సిద్ధమైంది. రాష్ట్రానికి ఫ్రాంచైజీ లేకపోయినా.. ఢిల్లీ క్యాపిటల్స్ (డీసీ) జట్టు వైఎస్సార్ ఏసీఏ–వీడీసీఏ స్టేడియంను తమ రెండో హోమ్ గ్రౌండ్‌గా ఎంచుకుంది. ఐపీఎల్ 18వ సీజన్‌లో భాగంలో సోమవారం రాత్రి 7.30 గంటలకు లక్నో సూపర్ జెయింట్స్‌తో ఢిల్లీ క్యాపిటల్స్ తలపడుతుంది. ఈ సీజన్‌లో ఇరు జట్లకు **ఇదే తొలి మ్యాచ్ కావడం విశేషం. గత సీజన్లలో విశాఖ వేదికగా ఆరు ఫ్రాంచైజీ జట్లు ఆడగా, లక్నో సూపర్** జెయింట్స్‌కు మాత్రం ఇదే తొలి మ్యాచ్. మ్యాచ్ ప్రీ సెషన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ అక్షర్ పటేల్ మాట్లాడుతూ ప్రత్యర్థిని తక్కువ స్కోరుకే కట్టడి చేయడం తమ ప్రణాళికగా చెప్పారు. దీనిని బట్టి చూస్తే టాస్ గెలిస్తే ఫీల్డింగ్ ఎంచుకునే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. మొత్తానికి విశాఖ క్రికెట్ అభిమానులు ఈ ఉత్కంఠభరితమైన పోరు కోసం ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నారు.

– విశాఖ స్పోర్ట్స్


ప్రాక్టీస్ సెషన్‌లో ఎల్ఎస్‌జీ జట్టు

ఐపీఎల్ మ్యాచ్‌కు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

అల్లిపురం: పీఎంపాలెంలోని డాక్టర్ వైఎస్సార్ వీసీఏ–ఏడీసీఏ క్రికెట్ స్టేడియంలో సోమవారం జరిగే క్రికెట్ మ్యాచ్‌కు ఏపీఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. ఈ మేరకు ఏపీఎస్ ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. గాజువాక, పాత బస్టాండ్, సింహాచలం, కూర్మన్నపాలెం నుంచి సుమారు 30 బస్సులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. రద్దీకి అనుగుణంగా బస్సుల పెంపు, తగ్గింపు ఉంటుందన్నారు. పోలీసు శాఖ ఆదేశాలతో విజయనగరం, శ్రీకాకుళం వెళ్లే బస్సులను సాయంత్రం 5 గంటల తర్వాత హనుమంతువాక నుంచి బీచ్‌రోడ్డు వైపు మళ్లిస్తామన్నారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

గవర్నర్‌కు స్వాగతం


గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న అధికారులు

గోపాలపట్నం: రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ దంపతులు ఆదివారం సాయంత్రం విశాఖ చేరుకున్నారు. విమానాశ్రయంలో కలెక్టర్ హరేందిర ప్రసాద్, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, డీసీపీ–2 మేరి ప్రశాంతి, గాజువాక, గోపాలపట్నం తహసీల్దార్లు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. సోమవారం విశాఖలోని వైఎస్సార్ ఏడీఏ వీడీసీఏ స్టేడియంలో జరగనున్న లక్నో సూపర్ జెయింట్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య జరగనున్న ఐపీఎల్ మ్యాచ్‌ను వీక్షించనున్నారు.

స్మార్ట్‌కు మించి!



- ప్రీమియం స్మార్ట్‌ఫోన్ల కొనుగోలుకు వైజాగ్‌వాసుల ఆసక్తి
- అల్ట్రా ప్రీమియం ఫోన్ల వినియోగంలో 3వ స్థానంలో నగరం
- ప్రముఖ మార్కెట్ రీసెర్చ్ సంస్థ కౌంటర్ పాయింట్ నివేదికలో వెల్లడి

సాక్షి, విశాఖపట్నం : స్మార్ట్‌ఫోన్ ఇప్పుడు కేవలం అవసరం మాత్రమే కాదు.. ఒక స్టేటస్ సింబల్‌గా మారిపోయింది. ఒకప్పుడు ఫోన్ పాడైపోయే వరకు వాడాల్సిన పరిస్థితి ఉండేది. ఇప్పుడు కొత్తగా స్మార్ట్ ఫీచర్లు వస్తే చాలు.. రేటుతో పనిలేకుండా కొనాల్సిందే అనే రోజులు వచ్చేశాయి. ఎందుకంటే ఫోన్ ఇప్పుడు ఇంట్లో ఒక వస్తువు కాదు.. శరీరంలో ఒక భాగమైపోయింది. అందుకే వైజాగ్ ప్రజలు చాలా మంది చెబుతున్న మాట ఒక్కటే.. నా ఫోన్ స్మార్ట్ మాత్రమే కాదు.. ప్రీమియం.! ఈ విషయాన్ని ప్రముఖ మార్కెట్ పరిశోధనా సంస్థ కౌంటర్ పాయింట్ ధ్రువీకరించింది. ద్వితీయ శ్రేణి నగరాల్లోని ప్రజలు వాడుతున్న అత్యంత ఖరీదైన స్మార్ట్‌ఫోన్ల గురించి కౌంటర్ పాయింట్ ఒక సర్వే నిర్వహించింది. ఈ సర్వేలో సూరత్ మొదటి స్థానంలో నిలవగా, విశాఖ మూడవ స్థానంలో ఉండటం విశేషం.

ఒకప్పుడు కేవలం మాట్లాడటానికి ఉపయోగపడే ఫోన్ ఇప్పుడు ఒక కొత్త ప్రపంచాన్ని సృష్టించింది. అత్యాధునిక ఫీచర్లతో ప్రపంచాన్నే అరచేతిలో **చూపిస్తోంది. అందుకే ప్రజలు కొత్త ఫోన్ కొనడానికి అంత ఆసక్తి చూపుతున్నారు. అద్భుతమైన ఫీచర్లు ఉంటే చాలు.. ధర గురించి ఆలోచించడం లేదు. కౌంటర్ పాయింట్ టెక్నాలజీ మార్కెట్ రీసెర్చ్ సంస్థ** ఇటీవల ఈ విషయాన్ని తెలిపింది. టైర్–2 నగరాల్లో అల్ట్రా ప్రీమియం స్మార్ట్‌ఫోన్ అమ్మకాలలో సిల్క్ సిటీ, డైమండ్ సిటీగా పేరొందిన సూరత్ ముందు వరసలో ఉంది. దేశంలోని ప్రధాన మెట్రో నగరాలైన కోల్‌కతా, హైదరాబాద్, అహ్మదాబాద్, చెన్నైని మించి మరీ ఇక్కడ ప్రీమియం స్మార్ట్‌ఫోన్ల విక్రయాలు జరుగుతుండటం విశేషం. దేశీయ మార్కెట్ వాటాలో సూరత్ 24 శాతం ఆక్రమించడం గమనార్హం. సూరత్‌లో ఎక్కువగా రూ.2,45,000 కంటే ఎక్కువ ధర గల స్మార్ట్‌ఫోన్ల విక్రయాలు జరుగుతున్నట్లు నివేదిక చెబుతోంది.

ఆపిల్ ప్రో.. లేదంటే ఎస్ సిరీస్..

మహా విశాఖ నగరంలో అల్ట్రా ప్రీమియం స్మార్ట్ ఫోన్ల



విక్రయాల్లో ఆపిల్, శాంసంగ్ పోటీపడుతున్నాయి. వీటి తర్వాత వన్‌ప్లస్, వివో, గూగుల్, షియోమీ ఫోన్ల కొనుగోలుపై నగరవాసులు ఆసక్తి చూపిస్తున్నారు. ఆపిల్ 16, 16 ప్రోతో పాటు శాంసంగ్ ఎస్ 23, 24, 25 సిరీస్ ఫోన్లు హాట్ కేకుల్లా అమ్ముడుపోతున్నాయని కౌంటర్ పాయింట్ సర్వే చెబుతోంది. ప్రతి 50 మందిలో ఒకరు రూ.1.50 లక్షకు మించి ధర పెట్టి కొనుగోలు చేసిన ఫోన్లను వాడుతున్నట్లు ఈ సర్వేలో తేలింది. ఏఐ ఆధారిత ఫీచర్లపై పెరుగుతున్న ఆసక్తి నేపథ్యంలో ప్రీమియం ఫోన్లను ఆశ్రయిస్తున్నట్లు వినియోగదారులు చెబుతున్నారు.

వైజాగ్ వాసులూ.. ప్రీమియం ప్రియులే.!

ద్వితీయ శ్రేణి నగరాల్లో అన్ని విభాగాల్లోనూ ముందు వరుసలో ఉండే విశాఖ.. ప్రీమియం ఫోన్ల కొనుగోళ్లలోనూ తక్కువేం కాదని నిరూపించుకుంది. సూరత్ తర్వాత జైపూర్ రెండో స్థానంలో ఉండగా, మూడో స్థానంలో విశాఖపట్నం నిలిచింది. రూ.1.50 లక్షల నుంచి రూ.2.45 లక్షల కంటే ఎక్కువ ధర ఉన్న ఫోన్ల కొనుగోళ్లలో వైజాగ్ మార్కెట్ వాటా 0.8 శాతంగా ఉంది. ప్రీమియం మోడళ్ల వైపు నగరవాసుల మార్పు ఏడాది పొడవునా స్పష్టంగా కనిపించింది. ఎందుకంటే వైజాగ్‌లో స్మార్ట్‌ఫోన్ అమ్మకాల్లో ప్రీమియం ఫోన్ల విభాగం వాటా మే 2024లో 10 శాతం నుంచి అక్టోబర్‌లో 18 శాతానికి పెరగడం విశేషం.

ఈఎంఐ సౌకర్యంతో సులువుగా..

పెద్ద మొత్తంలో ఒకేసారి డబ్బుల చెల్లించి ఫోన్ కొనుగోలు చేసే విషయంలో మాత్రం వైజాగ్ వాసులు కాస్త జంకుతున్నారు. ఎంత ఖరీదైన ఫోన్ అయినా.. ఉందిగా ఈఎంఐ అంటూ వాయిదా పద్ధతిలో డబ్బులు చెల్లిస్తూ అల్ట్రా ప్రీమియంకి మారిపోతున్నారు. ప్రతి ఫోన్ కొనుగోలుపైనా ఈఎంఐ ఆఫర్లతో సెల్‌ఫోన్ షాపుల్లోనే కాకుండా..ఈ–కామర్స్ ప్లాట్‌ఫాంలలోనూ బ్యాంకులు, ఫైనాన్సింగ్ సంస్థలు ఆకర్షిస్తుండటంతో పని సులువవుతోంది. 3 లేదా 6 నెలల చెల్లింపుపై ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నారు. ఏడాది వాయిదాలు చెల్లిస్తున్న వారి సంఖ్య తక్కువగా ఉంది.

కెమెరా ఫీచర్ నచ్చితే చాలు



హై ఎండ్ ఫీచర్లున్న ఫోన్లు వాడటమంటే చాలా ఇష్టం. ముఖ్యంగా కెమెరా బాగుండాలి. ఇటీవల ఐఫోన్–16 ప్రో తీసుకున్నాను. దానికంటే ఎస్–24 అల్ట్రాలో కెమెరా అద్భుతంగా ఉందని చూశాను. ఇప్పుడు దానికి షిఫ్ట్ అవుతున్నాను. ప్రస్తుతం వస్తున్న ప్రీమియం ఫోన్లలో ఏఐ బేస్డ్ టెక్నాలజీతో పాటు కెమెరా వినియోగం కూడా వచ్చేసింది. టెక్‌లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతుండాలి.

– పుప్పాల మోహన లక్ష్మి, గృహిణి

బలం లేకపోయినా అవిశ్వాసమా?

- **మేయర్‌పై అవిశ్వాసం** ఖండిస్తున్నాం
- **దొడ్డి దారి రాజకీయాలు** చంద్రబాబుకు **వెన్నతో పెట్టిన** విద్య
- **తమ పార్టీ** కార్పొరేటర్లను బెదిరింపులు, **ప్రలోభాలకు** గురిచేస్తున్నారు
- **కూటమి నేతలు** చెప్పేవన్నీ **శ్రీరంగనీతులు**, చేసేవి అడ్డదారులు
- **వైఎస్సార్‌సీపీ** ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు


మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ కన్నబాబు, చిత్రంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్ తదితరులు

సాక్షి, విశాఖపట్నం : గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌లో కూటమికి సంఖ్యా బలం లేకపోయినా.. మేయర్ పీఠంపై అవిశ్వాస తీర్మానానికి నోటీసులు ఇచ్చారని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు అన్నారు. ఆదివారం మద్దిలపాలెంలో గల పార్టీ కార్యాలయంలో శాసనమండలి విపక్షనేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ అధ్యక్షతన వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు, సమన్వయకర్తలు, ముఖ్యనేతలతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటుచేశారు. అనంతరం కన్నబాబు మీడియాతో మాట్లాడుతూ దొడ్డిదారిన రాజకీయాలు చేయడం చంద్రబాబుకు, ఆ పార్టీ నేతలకు వెన్నతో పెట్టిన విద్యని, వైఎస్సార్ సీపీ గుర్తుపై గెలిచిన కార్పొరేటర్లను ప్రలోభపెట్టి, లొంగకపోతే భయపెట్టి బలవంతంగా లాక్కుంటున్నారని మండిపడ్డారు. కూటమి ప్రజాప్రతినిధులు చెప్పేవన్నీ శ్రీరంగనీతులు.. చేసేవన్నీ పనికిమాలిన రాజకీయాలంటూ మండిపడ్డారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, వైఎస్సార్ సీపీని అభిమానించే కార్పొరేటర్లంతా సమావేశానికి వచ్చారని.. కూటమి నేతలు ఎన్ని కుయుక్తులు పన్నినా మేయర్ పీఠాన్ని కదపలేరన్నారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న కూటమి ముఖ్యమంత్రి చంద్రబాబు ఇలాంటి కుళ్లు రాజకీయాలకు స్వస్తి పలకాలని హితవు పలికారు.

మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ జీవీఎంసీ ఎన్నికల్లో 58 స్థానాలను వైఎస్సార్ సీపీ కైవసం చేసుకుని మేయర్ పదవిని చేజిక్కించుకుందని, 30 స్థానాలు మాత్రమే గెలుచుకున్న టీడీపీ ఇప్పుడు మేయర్ పీఠాన్ని దక్కించుకోవాలనే దురాలోచన మానుకోవాలని హితవుపలికారు. కూటమి పార్టీలకు మెజారిటీ లేకపోయినా అవిశ్వాసానికి నోటీసు ఇచ్చారంటే.. తమ పార్టీ కార్పొరేటర్లను ఏవిధంగా భయపెడుతున్నారో.. ప్రలోభపెడుతున్నారో అర్థమవుతుందన్నారు. మేయర్ పీఠం ఎలా కాపాడుకోవాలనే దానిపై వ్యూహ రచనలు చేశామని, తప్పనిసరిగా కాపాడే ప్రయత్నం చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.


ఆకట్టుకున్న రూట్ మార్చ్

అల్లిపురం: రాష్ట్ర సేవికా సమితి, విశాఖ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పథ సంచలనం(రూట్ మార్చ్) నగరవాసులను ఆకట్టుకుంది. ప్రేమసమాజంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన ఈ కార్యక్రమంలో 200 మంది రాష్ట్ర సేవికలు పాల్గొని ప్రార్థనలు చేశారు. కర్ర సాము, ఇతర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ప్రేమ సమాజం నుంచి విశాఖ సేవా సదన్ వరకు డ్రమ్ వాయిద్యాల మధ్య ప్రత్యేకమైన కట్టుతో మహిళలు పథ సంచలనం చేపట్టారు.

పాము కాదు.. పైపే.!



సముద్రంలో నుంచి భారీ జలచరం బయటకు వస్తున్నట్టుగా ఉందా? భయపడకండి.. అది కేవలం మీ భ్రమ మాత్రమే. విశాఖ తీరంలో ఏటా సముద్ర కోతను నివారించడానికి డ్రెడ్జింగ్ చేస్తుంటారు. ప్రస్తుతం కురుసుర సబ్‌మెరైన్‌కు సమీపంలో ఈ ప్రక్రియ జరుగుతోంది. ఫొటోలో కనిపిస్తున్న ఈ భారీ పైపు నీటిపై తేలుతూ తీరం నుంచి సముద్రంలోకి వెళుతోంది. సముద్ర తీర సంరక్షణ కోసం చేపడుతున్న ఈ చర్య చూపరులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

కదం తొక్కిన ఉక్కు కాంట్రాక్టు కార్మికులు

- గాజువాక నుంచి కూర్మన్నపాలెం వరకు ఉపాధి రక్షణ పాదయాత్ర
- తొలగించిన కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్


పాదయాత్రలో పాల్గొన్న ఉక్కు కాంట్రాక్టు కార్మికులు, నాయకులు

గాజువాక : స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికుల తొలగింపును నిరసిస్తూ ఆదివారం భారీ పాదయాత్ర నిర్వహించారు. ఉపాధి రక్షణ యాత్ర పేరుతో విశాఖ ఉక్కు అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పాదయాత్రలో కాంట్రాక్టు కార్మికులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. కొత్తగాజువాక జంక్షన్‌లో ప్రారంభమైన ఈ పాదయాత్ర గాజువాక మెయిన్‌రోడ్, పాతగాజువాక, శ్రీనగర్ మీదుగా కూర్మన్నపాలెంలోని ఉక్కు కార్మికుల దీక్షా శిబిరం వరకు కొనసాగింది. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వైఎస్సార్‌సీపీ వ్యతిరేకమని స్పష్టం చేశారు. కాంట్రాక్టు కార్మికులను తొలగించడం దారుణమని, వెంటనే వారిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి పార్టీలను నమ్మి పెద్ద ఎత్తున మెజారిటీ ఇచ్చిన కార్మికులకు కూటమి ప్రజాప్రతినిధులు మద్దతు నిలవకపోవడం సరికాదన్నారు. కష్టంలో ఉన్న కాంట్రాక్టు కార్మికులకు అండగా నిలవాలని సూచించారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మడానికి, కార్మికులను తొలగించడానికి మాత్రమే కేంద్ర ప్రభుత్వం ప్యాకేజీ ప్రకటించిందన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో పూర్తి స్థాయి ఉత్పత్తి సాధించడానికి ఆ ప్యాకేజీ వల్ల ఎలాంటి ఉపయోగంలేదన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుతామని, నిర్వాసితులకు ఉపాధి ఇస్తామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన కూటమి నాయకులు ఎన్నికల్లో గెలిచిన తరువాత మొహం చాటేస్తున్నారన్నారు.

ఉక్కు పరిరక్షణ కమిటీ కన్వీనర్ జె.అయోధ్య రామ్ మాట్లాడుతూ ప్లాంట్ కోసం కార్మికులు 1500 రోజుల నుంచి ఉద్యమం చేస్తే కేంద్ర ప్రభుత్వం రూ.11,400 కోట్లు ప్యాకేజీ ఇచ్చిందన్నారు. ఇప్పుడు ఐదు వేల మంది కాంట్రాక్టు కార్మికులను రోడ్డుపైకి నెట్టేయడం కోసం ప్రయత్నిస్తోందన్నారు. అందులోభాగంగా ఇప్పటికే వెయ్యి మందిని బయటకు పంపేసిందన్నారు. సెయిల్‌లో కలపడానికి గాని, సొంత గనులు కేటాయించడానికి గాని కేంద్ర ప్రభుత్వానికి ఒక్క రూపాయి కూడా ఖర్చు కాదని, అయినప్పటికీ ప్రభుత్వం ఆ పని చేయకుండా ఉద్యోగులను తొలగిస్తోందన్నారు. కార్మికుల తొలగింపును ఆపకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, విశాఖ స్టీల్‌ప్లాంట్ అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నేడు రుషికొండ బీచ్‌లో బ్లూఫ్లాగ్ ఆవిష్కరణ

మహారాణిపేట: రుషికొండ బీచ్‌లో మళ్లీ నీలి జెండా రెపరెపలాడనుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బ్లూఫ్లాగ్ గుర్తింపు పొందిన రుషికొండ బీచ్ నిర్వహణను గాలికొదిలేసింది. దీంతో ప్రపంచ స్థాయి బీచ్ అస్తవ్యస్తంగా మారిపోయిందని సందర్శకులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ బ్లూఫ్లాగ్ ప్రతినిధులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన డెన్మార్క్ ప్రతినిధులు బ్లూఫ్లాగ్ సర్టిఫికేషన్‌ను తాత్కాలికంగా రద్దు చేశారు. దీనిపై తీవ్ర వ్యతిరేకత రావడంతో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో మళ్లీ రుషికొండ బీచ్‌కు బ్లూఫ్లాగ్ గుర్తింపును పునరుద్ధరించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ సోమవారం రుషికొండ బీచ్ ను సందర్శించనున్నారు. పర్యాటక శాఖ అధికారులు, బ్లూ ఫ్లాగ్ ప్రతినిధులతో కలిసి ఫ్లాగ్‌ను ఆవిష్కరించనున్నారు.

శారదా పీఠానికి నోటీసులు

పెందుర్తి: చినముషిడివాడలోని శారదా పీఠం నిర్మాణంలో ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురైందని నిర్ధారించిన పెందుర్తి తహసీల్దార్ నోటీసులు జారీ చేశారు. చినముషిడివాడ సర్వే నెంబర్ 90లో పోరంబోకు–రస్తా 22 సెంట్లు భూమిని పీఠం ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టిందని తహసీల్దార్ ఎం.ఆనంద్‌కుమార్ తెలిపారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకోవడానికి గల కారణాలను రాతపూర్వకంగా తనకు వారం రోజులలోపు తెలియజేయాలని పేర్కొన్నారు. లేని పక్షంలో ఆక్రమిత స్థలంలో నిర్మాణాలను తొలగిస్తామని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.



ఇద్దరా.. ఒక్కరా?

బీచ్‌రోడ్డులో త్వరలో ప్రారంభం కానున్న హెలికాప్టర్ మ్యూజియం వద్ద ఒక దృశ్యం ఆసక్తికరంగా కనిపించింది. మెరిసే అద్దాలను శుభ్రం చేస్తున్న కార్మికుడి ప్రతిబింబం.. ఆ అద్దంలో స్పష్టంగా దర్శనమిచ్చింది. దూరం నుంచి చూసే వారికి అక్కడ ఇద్దరు వ్యక్తులు పనిచేస్తున్నారేమో అనే భ్రమ కలిగింది. పర్యాటకంగా ఎప్పుడూ సందడిగా ఉండే విశాఖ సాగర తీరంలో ఈ హెలికాప్టర్ మ్యూజియం మరో ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది.

ఎండు చేప.. వెండి మెరుపు



తిమ్మాపురం నుంచి మంగమారిపేటకు వెళ్లే రహదారిలో ఒక చిత్రం కనిపించింది. దూరం నుంచి చూస్తే ఆ రోడ్డు వెండి వెలుగులతో మెరిసిపోతున్నట్లు అనిపించింది. దగ్గరికి వెళ్లి చూస్తే తెలిసింది అది రోడ్డు కాదని.. మత్స్యకారులు తమ వలకు చిక్కిన చేపలను ఎండబెట్టారని.! సూర్యకాంతి పరావర్తనం చెందడం వల్ల అవి మిలమిల మెరుస్తూ చూపరులను ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి.

బీళ్లు.. కన్నీళ్లు.!



కాపులుప్పాడలోని రాజుగారి చెరువు పూర్తిగా ఎండిపోయింది. ఒకప్పుడు పంట పొలాలకు సమృద్ధిగా సాగునీటిని మాత్రమే కాకుండా, పరిసర ప్రజల ఇతర అవసరాలను ఈ చెరువు తీర్చింది. ఇప్పుడు నీటి జాడలేక నేలతల్లి నెర్రెలు బారింది. చెరువులో ఎండిపోయిన కర్రలను ఏరుకోవడానికి వచ్చిన ఓ మహిళ.. ప్లాస్టిక్ బాటిల్‌లో తీసుకొచ్చిన నీటితో తన దాహార్తిని తీర్చుకుంటోంది. ప్రస్తుత నీటి ఎద్దడి పరిస్థితులకు ఈ చిత్రం అద్దం పడుతోంది.

రంజాన్ శోభ



పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఆర్.కె.బీచ్ ఆధ్యాత్మిక శోభతో నిండిపోయింది. రోజంతా ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లిం సోదరులు ఆదివారం సాయంత్రం సాగరతీరంలో సామూహికంగా ఇఫ్తార్‌లో పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో ముస్లింలు తరలిరావడంతో తీరం సందడిగా మారింది.ఇఫ్తార్‌లో అన్ని వయసుల వారు పాల్గొన్నారు. మత సామరస్యానికి, సోదరత్వానికి గొప్ప ఉదాహరణగా ఈ కార్యక్రమం నిలిచింది.

-ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



ప్రాణం తీసిన ఈత సరదా



సాయిక్రాంతి మృతదేహాన్ని బయటకు తీస్తున్న గజ ఈతగాళ్లు

పెందుర్తి: వారాంతంలో స్నేహితులతో సరదాగా గడుపుదామని పార్టీకి వెళ్లిన ఓ వ్యక్తి మేహాద్రి రిజర్వాయర్ కాలువలో అసువులు బాశాడు. స్నేహితులతో సరదాగా ఈతకు దిగిన డబ్బీరు సాయిక్రాంతి(28) అనే వ్యక్తిని మృత్యువు కబళించింది. సీఐ కె.వి.సతీష్‌కుమార్ తెలిపిన వివరాలివి. గోపాలపట్నం సమీపంలోని బుచ్చిరాజుపాలేనికి చెందిన 9 మంది స్నేహితులు కోటనరవ సమీపంలోని ఎంఈఎస్ పంపు హౌస్ సమీపంలో ఉన్న మేహాద్రి రిజర్వాయర్ కాలువ వద్దకు పిక్నిక్‌కు వెళ్లారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో అందరూ కలిసి స్నానాలకు కాలువలో దిగారు. అయితే డబ్బీరు సాయిక్రాంతి ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. ఆందోళనకు గురైన స్నేహితులు పెందుర్తి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు తక్షణమే గజ ఈతగాళ్లను రప్పించి సాయిక్రాంతి కోసం గాలించారు. మృతదేహాన్ని నీటిలో నుంచి బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

• సాగరతీరం కిటకిట



సాగరతీరం ఆదివారం సందర్శకులతో కళకళలాడింది. వారాంతం కావడంతో నగరవాసులు, పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో కాస్త ఇబ్బంది పడినప్పటికీ, మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో ఆకాశం మేఘావృతం కావడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. దీంతో నగర ప్రజలు బీచ్ వైపు పరుగులు తీశారు. పిల్లలు ఇసుకలో ఆటలాడుకుంటూ, పెద్దలు తీరం వెంబడి నడుస్తూ ఆనందంగా గడిపారు. కొంతమంది సముద్రంలో స్నానాలు చేశారు. యువత తమ స్నేహితులతో కలిసి సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. ఆహార స్టాళ్లు సందర్శకులతో కిటకిటలాడాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

◆ బెంగళూరు కేంద్రంగా ప్లైవుడ్ పరిశ్రమ నడుపుతున్నట్లు మద్ది ప్రసాద్ అనే వ్యక్తి విశాఖపట్నం, ఇతర నగరాలకు కలప సరఫరా చేస్తున్నట్లుగా వ్యాపార లావాదేవీలు చూపించారు. దీనికి సంబంధించి ఏకంగా రూ.171.45 కోట్ల నకిలీ ఇన్‌వాయిస్‌లని సృష్టించి.. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌లను క్లెయిమ్ చేసేందుకు దరఖాస్తు చేసుకున్నారు. దీని ద్వారా రూ.30.85 కోట్ల విలువైన జీఎస్టీ ఎగవేసేందుకు పన్నాగం పన్నారు. దీనిపై దృష్టి సారించిన డీజీజీఐ బృందం.. ప్రసాద్‌ని అదుపులోకి తీసుకున్నారు.

◆ రెండేళ్ల క్రితం ఇంటర్ చదివి జులాయిగా తిరిగే యువకుడు చిన్న చిన్న వ్యాపార సంస్థల్లో పనిచేస్తూ.. జీఎస్టీ లొసుగుల్ని పసిగట్టాడు. వైజాగ్, రాజమండ్రి, విజయవాడ, గుంటూరు, హైదరాబాద్ మొదలైన నగరాల్లో ఏకంగా 20 ఫేక్ కంపెనీలు సృష్టించి.. పన్ను మోసాలకు పాల్పడేందుకు ఎత్తుగడ వేశాడు. ఈ సంస్థల నుంచి దేశంలోని వివిధ నగరాల్లోని కంపెనీలకు సరకు లావాదేవీలు జరిపినట్లు రూ.265 కోట్ల మేర నకిలీ ఇన్‌వాయిస్‌లు రూపొందించాడు. వీటిని ఉపయోగించుకొని రూ.31 కోట్ల ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ని సొంత చేసుకునేందుకు ప్రయత్నించాడు. అప్పటికే 10 కోట్ల వరకూ క్రెడిట్ చేసుకున్న యువకుడి వ్యవహారాన్ని చివరి నిమిషంలో బట్టబయలు చేశారు.

ఇన్‌పుట్ ట్యాక్స్ స్వాహా!

- ఫేక్ కంపెనీలతో నకిలీ ఇన్‌వాయిస్‌ల సృష్టి
- ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ని సొంతం చేసుకునేందుకు వ్యాపారుల కుయుక్తులు
- విశాఖ డివిజన్ పరిధిలో రూ.కోట్లలో మోసాలు
- సహకరిస్తున్న కొందరు జీఎస్టీ సిబ్బంది
- 'ఇన్‌పుట్'ను చెరో సగం పంచుకుంటున్న వైనం



సాక్షి, విశాఖపట్నం : నకిలీ ఇన్‌వాయిస్‌ల పేరుతో మోసాలు జరుగుతూనే ఉన్నాయి. ఫేక్ కంపెనీల పేరుతో పన్నుల చెల్లింపును ఎగవేసేలా వ్యూహాల్ని అమలు పరుస్తున్నారు. కొన్ని కంపెనీలు చిన్న చిన్న తప్పులతో దొరికిపోతుంటే.. చాలా మంది వ్యాపారులు మాత్రం దర్జాగా ఇన్‌పుట్ క్రెడిట్‌ని తమ ఖాతాల్లోకి జమ చేసుకుంటున్నారు. డైరెక్టర్ జనరల్ ఆఫ్ జీఎస్టీ ఇంటిలిజెన్స్(డీజీజీఐ) విశాఖపట్నం జోనల్ యూనిట్ పరిధిలో దాదాపు 380కి పైగా నకిలీ కంపెనీల గుట్టు రట్టు చేసి రూ.300 కోట్లుకు పైగానే రికవరీ చేశారు. అయినా ఫేక్ కంపెనీలు నకిలీ ఇన్‌వాయిస్‌లతో రెచ్చిపోతున్నాయి.

ఖజానాకు చిల్లు!

ముఖ్యంగా స్టేట్ ట్యాక్స్ కార్యాలయంలోని కొందరు సిబ్బందితో పాటు సూర్యాబాగ్, సిరిపురం, ద్వారకానగర్, డాబాగార్డెన్స్, కురుపాం మార్కెట్, గాజువాక, అనకాపల్లి, చినవాల్తేరు సర్కిల్స్ పరిధిలో ఈ తరహా నకిలీ ఇన్‌వాయిస్‌లు ఎక్కువగా సృష్టించి.. ఇన్‌పుట్ క్రెడిట్ కుంభకోణంతో ఖజానాకు చిల్లు పెడుతున్నారు. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న కంపెనీల్ని గుర్తిస్తున్నా.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల్ని మాత్రం.. ఏదో ఒక రూపంలో.. మోసం చేస్తూనే ఉన్నారు. కేవలం వ్యాపారుల వైపు నుంచి మాత్రమే ఉన్నతాధికారులు దృష్టిసారిస్తుండటంతో.. ఇంటిదొంగలెవరూ పూర్తిస్థాయిలో దృష్టి సారించకపోవడంతో.. ఆకాశమే హద్దుగా చెలరేగిపోతున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి.

సిబ్బంది చేతివాటం ?

ఫేక్ ఇన్‌వాయిస్‌లు సృష్టిస్తున్న కొందరు నకిలీ వ్యాపారులకు కేంద్ర, రాష్ట్ర జీఎస్టీ కార్యాలయాల్లోని కొందరు దిగువ స్థాయి సిబ్బంది సహకారం అందుతున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఫేక్ ఇన్‌వాయిస్‌లను పక్కాగా ఎలా తయారు చేయాలి..? వాటిని ఏ సమయంలో సమర్పిస్తే.. ఎవరికీ అనుమానం రాకుండా పూర్తిస్థాయిలో వెరిఫికేషన్ జరగదు.. ఎలా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ని సొంతం చేసుకోవచ్చు.. ఇలా.. సమగ్ర వివరాలతో స్కెచ్ వేస్తూ.. సక్రమంగా అమలయ్యేటట్లుగా ప్లాన్ చేస్తున్నారు. ఫైల్స్ తమ దగ్గర నుంచే వెళ్లేలా చూస్కొని ఎవరికీ అనుమానం రాకుండా ఇన్‌పుట్‌ని కొట్టేస్తూ.. చెరిసగం పంచేసుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆఖరి నిమిషంలో.. హంగామా

- జీసీ కార్పొరేషన్ రుణాల మంజూరులో గందరగోళం
- ఆర్థిక సంవత్సరం ముగింపు సమయంలో దరఖాస్తుల స్వీకరణ
- దరఖాస్తు గడువు మరో మూడు రోజులు పొడిగింపు
- ప్రభుత్వ తీరు, రుణాల మంజూరుపై సర్వత్రా అనుమానాలు



రుణాల మంజూరుకు ఆన్‌లైన్ దరఖాస్తు వెబ్‌సైట్

ఎంవీపీకాలనీ: ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న సమయంలో జిల్లా బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలు మంజూరుకు దరఖాస్తులు ఆహ్వానించడం దుమారం రేపింది. 2024–2025 ఆర్థిక సంవత్సరానికి గానూ స్వయం ఉపాధి కోసం బీసీ, ఈబీసీ, కాపు, బ్రాహ్మణ, కమ్మ, ఆర్యవైశ్య ఇలా ఆ కార్పొరేషన్ పరిధిలోని అనేక అనుబంధ కార్పొరేషన్ల ద్వారా జిల్లాలోని వెనుకబడిన తరగతుల వారికి రుణాలు మంజూరు చేయనున్నట్లు తెలిపింది. ఈ మేరకు ఈ నెల 11న నోటిఫికేషన్ విడుదల చేసి, తొలుత దరఖాస్తులకు 22వ తేదీని చివరి తేదీగా పేర్కొంది. అయితే, తాజాగా మరో మూడు రోజులు దరఖాస్తు గడువును పొడిగించింది. గత ప్రభుత్వం ఇచ్చిన సంక్షేమ పథకాలను నిలిపివేసిన కూటమి ప్రభుత్వం, ఏడాది మొత్తం వదిలేసి ఆర్థిక సంవత్సరం ముగింపు సమయంలో రుణాల నోటిఫికేషన్ విడుదల చేయడంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పైగా, గడువును పొడిగించడం ఈ అనుమానాలకు మరింత బలం చేకూరుస్తోంది. ఈ నేపథ్యంలో అసలు ఈ రుణాలు లబ్ధిదారులకు అందుతాయా లేదా కేవలం ప్రచారం కోసమే కూటమి ప్రభుత్వం ఈ నోటిఫికేషన్‌తో హడావిడి చేస్తుందా అనే ప్రశ్నలు లబ్ధిదారుల నుంచి సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

20,914 మంది దరఖాస్తులు

స్వయం ఉపాధి, జనరిక్ ఫార్మసీలు, వివిధ కులవృత్తులకు ఆర్థిక సహాయం అందించే లక్ష్యంతో 2024–2025 ఆర్థిక సంవత్సరానికి గానూ బీసీ కార్పొరేషన్ ఈ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. నోటిఫికేషన్ విడుదలైన 11 రోజుల్లోనే జిల్లా వ్యాప్తంగా 20,914 ఆన్‌లైన్ దరఖాస్తులు(శనివారం సాయంత్రం 4 గంటల వరకు) వచ్చినట్లు బీసీ కార్పొరేషన్ కార్యాలయం తెలిపింది. ప్రభుత్వం కేవలం 6,032 యూనిట్ల మంజూరు లక్ష్యాన్ని నిర్దేశించగా, వచ్చిన దరఖాస్తుల సంఖ్య చాలా ఎక్కువగా ఉంది. మరోవైపు ఆర్థిక సంవత్సరం ముగియడానికి వారం రోజులే ఉండటంతో, ఈ భారీ సంఖ్యలో వచ్చిన దరఖాస్తుల పరిశీలన, అర్హుల ఎంపిక ప్రక్రియ ఎప్పుడు పూర్తవుతుందనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి కార్పొరేషన్ ద్వారా మంజూరు చేసే రుణాల ప్రక్రియ ప్రతి సంవత్సరం మార్చి నాటికి పూర్తవుతుంది. ఆ తర్వాత కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో కొత్త నోటిఫికేషన్లు విడుదల చేస్తారు. అయితే ఈసారి మాత్రం 2024–2025 సంవత్సరానికి సంబంధించిన రుణాల ప్రక్రియను మార్చి చివరిలో ప్రారంభించడం అనేక అనుమానాలకు తావిస్తోంది. దీనికి తోడు, కేవలం 11 రోజుల వ్యవధిలో 20 వేలకు పైగా దరఖాస్తులు రావడం వెనుక కూటమి నాయకుల హస్తం ఉందనే అనుమానాలు కూడా వినిపిస్తున్నాయి. ఈ హడావుడి నోటిఫికేషన్ ద్వారా తమకు కావాల్సిన వారికే రుణాలు మంజూరు చేయించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. దీంతో ఈ రుణాల మంజూరు ప్రక్రియలో పారదర్శకత లోపించే అవకాశం ఉందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

షెడ్యూల్ ప్రకారం పూర్తి చేస్తాం



ప్రభుత్వం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం రుణాల మంజూరు ప్రక్రియను పూర్తి చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఏప్రిల్ 27 నాటికి రుణాలు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది. మే 1 నాటికి మంజూరు ప్రక్రియ మొత్తం పూర్తి చేయాలి. మే 11 నాటికి జియో ట్యాగింగ్, మే 21 నాటికి వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేయాలనే ఆదేశాలతో ముందుకు సాగుతున్నాం. ఆర్థిక సంవత్సరం ముగింపు సమయంలో నోటిఫికేషన్ విడుదలైన విషయం వాస్తవమే. అందుకే రెండు నెలల్లో మొత్తం ప్రక్రియ పూర్తి చేసేలా ప్రభుత్వం షెడ్యూల్ రూపొందించింది.

– శ్రీదేవి, ఈడీ బీసీ కార్పొరేషన్

స్క్రాప్ దుకాణంలో అగ్ని ప్రమాదం

- రూ.30 లక్షల వరకు ఆస్తి నష్టం
- ప్రమాదంపై భిన్నాభిప్రాయాలు



మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

మధురవాడ: కాపులుప్పాడ జీవీఎంసీ డంపింగ్ యార్డుకు సమీపంలో ఆదివారం మధ్యాహ్నం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. డంపింగ్ యార్డుకు అత్యంత సమీపంలో ఉన్న ఒక స్క్రాప్ దుకాణంలో మంటలు చెలరేగాయి. వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన చెత్తను ఈ దుకాణంలో కంప్రెస్ చేసి, ప్యాకింగ్ చేసి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. అలాగే ఇక్కడ చెత్త నుంచి వివిధ రకాల పదార్థాలను వేరు చేసే కార్యకలాపాలు కూడా జరుగుతున్నట్లు సమాచారం. మధ్యాహ్న సమయంలో ఎండ తీవ్రంగా ఉండటంతో మంటలు క్షణాల్లోనే దుకాణం పరిసరాలకు వ్యాపించాయి. చెత్త, ఇతర సామగ్రి పూర్తిగా కాలి బూడిదయ్యాయి. దట్టమైన పొగ వ్యాపించడంతో పరిసర ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందారు. నిర్వాహకులు, స్థానికులు మంటలను అదుపు చేయడానికి ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. సమాచారం అందుకున్న వెంటనే తాళ్లవలస, నగరం నుంచి రెండు అగ్నిమాపక శకటాలు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశాయి. పెద్ద ఎత్తున ఎగసిన మంటలు అదుపులోకి రావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాదంలో సుమారు రూ. 30 లక్షల విలువైన సామగ్రి, యంత్రాలు కాలిపోయాయని దుకాణ నిర్వాహకులు తెలిపారు. అయితే ఈ ప్రమాదంపై భిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బాధితుడు భద్రం తెలిపిన వివరాల ప్రకారం, మధ్యాహ్నం 1.15 నుంచి 2 గంటల మధ్య గుర్తు తెలియని వ్యక్తులు సిగరెట్ చెత్త ఉన్న ప్రాంతంలో పడేయడం వల్ల మంటలు వ్యాపించి ఉండవచ్చని తెలిపారు. స్థానికులు మాత్రం చెత్తను తగలబెట్టడం వల్ల మంటలు స్క్రాప్ దుకాణానికి అంటుకుని ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

విశాఖలో సినిమా నిర్మిస్తే హిట్టే..

- బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేయడం నేరం
- 'అక్కడ అమ్మాయి.. ఇక్కడ అబ్బాయి' చిత్ర హీరో ప్రదీప్ మాచిరాజు



విడుదల తేదీని చూపిస్తున్న హీరో హీరోయిన్లు

అల్లిపురం: విశాఖలో ఏ చిత్రం నిర్మించినా విజయం సాధిస్తుందనే సెంటిమెంట్ తనకు ఉందని హీరో ప్రదీప్ మాచిరాజు అన్నారు. విశాఖ, అరకు పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ జరుపుకున్న ఆయన తాజా చిత్రం 'అక్కడ అమ్మాయి..ఇక్కడ అబ్బాయి' విడుదలకు సిద్ధమైంది. ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా ఆదివారం హీరోయిన్ దీపిక, యూనిట్ నగరంలో సందడి చేసింది. ఈ సందర్భంగా ఓ హోటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ప్రదీప్ మాట్లాడారు. లవ్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం రూపుదిద్దుకుందన్నారు. ఉదిత్ నారాయణ్ ఆలపించిన 'ఎవ్వడో ఈడి కొచ్చినాడు సూడు' అనే సూపర్‌హిట్‌గా నిలిచిందన్నారు. ఏప్రిల్ 11న వేసవిలో విడుదల కానున్న ఈ చిత్రం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్ రాసిన సాహిత్యం అద్భుతంగా ఉందని, సిద్ శ్రీరామ్ తన గాత్రంతో ఓ పాటను మరింత శ్రావ్యంగా ఆలపించారని కొనియాడారు. బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేయడం నేరమని ఓ ప్రశ్నకు సమాధానమిచ్చారు. హీరోయిన్ దీపిక మాట్లాడుతూ ఈ సినిమా కథ తన పాత్ర చుట్టూ తిరుగుతుందని, ప్రేక్షకులందరూ చిత్రాన్ని ఆదరించాలని కోరారు.

చందనోత్సవం సీఎఫ్‌వోగా భ్రమరాంబ



దర్భముళ్ల భ్రమరాంబ

సింహాచలం : సింహగిరిపై వచ్చే నెల 30న జరిగే చందనోత్సవానికి దేవదాయశాఖ తరఫున చీఫ్ ఫెస్టివల్ అధికారిగా ఆ శాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ దర్భముళ్ల భ్రమరాంబ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం దేవదాయశాఖ ప్రధానకార్యాలయం అడిషనల్ కమిషనర్ టి.చంద్రకుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం అమరావతిలో దేవదాయశాఖ ప్రధాన కార్యాలయంలో ఆర్జేసీగా ఉన్న నిర్వర్తిస్తున్న భ్రమరాంబ మూడు సార్లు సింహాచలం దేవస్థానం ఇన్‌చార్జి ఈవోగాను, 2022 చందనోత్సవంలో చీఫ్ ఫెస్టివల్ అధికారిగా విధులు నిర్వర్తించారు.

స్టీల్‌ప్లాంట్ నష్టాలకు కార్మిక నాయకులే కారణం

- ఆయా నాయకుల ఆస్తులపై ప్రభుత్వం విచారణ జరపాలి
- బీజేపీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు



మాట్లాడుతున్న సోము వీర్రాజు

ఎంవీపీకాలనీ : విశాఖ స్టీల్‌ప్లాంట్ నష్టాల్లోకి వెళ్లడానికి కార్మిక నాయకులే కారణమని బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు పేర్కొన్నారు. లాసన్స్ బే కాలనీలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ కార్మిక సంఘాల నాయకుల అనాలోచిత నిర్ణయాలు కారణంగానే ప్లాంట్‌కు నష్టం వాటిల్లుతుందన్నారు. ఆయా కార్మిక సంఘాల నాయకుల ఆస్తులపై విచారణ చేయాలని ప్రభుత్వానికి సూచించారు. రూ.11,400 కోట్లు నిధులు కేంద్రం స్టీల్‌ప్లాంట్‌కు కేటాయించినా కార్మిక నాయకులు అక్కడ ధర్నాలు చేసున్నారంటూ ఎద్దేవా చేశారు. అసలు అక్కడ నిరసన చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు ఎక్కడి నుంచి వచ్చారంటూ ప్రశ్నించారు. వారంతా రష్యా, చైనా బాగుండాలంటూ జెండాలు కట్టుకుని తిరిగే నాయకులంటూ ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీని పూర్తిగా ఖాళీ చేయడమే కూటమి లక్ష్యమన్నారు. బీజేపీని రాష్ట్ర వ్యాప్తంగా బలోపేతం చేయడంలో భాగంగా విస్తృత కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మాధవ్, పరశురామరాజు, ఆడారి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

• విశాఖ తీరంలో మరో ఆకర్షణ



అలరించనున్న హెలికాప్టర్

తుది దశకు హెలికాప్టర్ మ్యూజియం పనులు




యుద్ధ హెలికాప్టర్ మ్యూజియం

ఏయూక్యాంపస్:

సాగరతీరంలో మరో పర్యాటక ప్రాజెక్ట్ సిద్ధమవుతోంది. బీచ్ రోడ్డులో ఇప్పటికే ఉన్న టీయూ–142 యుద్ధ విమాన మ్యూజియం పక్కనే యూహెచ్–3 హెచ్ హెలికాప్టర్ మ్యూజియం తుది మెరుగులు దిద్దుకుంటోంది. వీఎంఆర్డీఏ ఆధ్వర్యంలో దాదాపు రూ. 2.2 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకుంటోంది. భారత నావికాదళంలో 17 ఏళ్లపాటు అవిరళంగా సేవలందించిన ఈ హెలికాప్టర్‌ను కొద్ది నెలల కిందట విశ్రాంతినిచ్చారు. విపత్తుల సమయంలోనూ, తీర ప్రాంత భద్రతలోనూ ఇది ఎంతో కీలక పాత్ర పోషించింది. దీని ప్రాముఖ్యాన్ని గుర్తించిన వీఎంఆర్డీఏ .. భారత నావికాదళ సత్తాను చాటి చెప్పేలా, పర్యాటకులకు సరికొత్త అనుభూతిని పంచేలా ఈ మ్యూజియాన్ని తీర్చిదిద్దుతోంది. ప్రస్తుతం ఈ ప్రాంగణంలో సుందరీకరణ పనులు ముగింపు దశకు చేరుకున్నాయి. రానున్న రెండు వారాల్లో దీనిని ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. హెలికాప్టర్ చుట్టూ పచ్చని లాన్‌లు, ప్రత్యేకమైన మొక్కలు, ఆకర్షణీయమైన నీటి ఫౌంటెన్‌లను ఏర్పాటు చేశారు. రాత్రి వేళల్లో విద్యుత్ కాంతుల్లో మరింత అందంగా కనిపించేలా దీని చుట్టూ అద్దాల నిర్మాణం చేపట్టారు. త్వరలోనే సందర్శన వేళలు, టికెట్ ధరల వివరాలను వీఎంఆర్డీఏ ప్రకటించే అవకాశం ఉంది. నేటి యువతరం సెల్ఫీలు, ఫొటోల పట్ల చూపిస్తున్న ఆసక్తిని దృష్టిలో ఉంచుకుని మ్యూజియం లోపలి భాగాన్ని ప్రత్యేకంగా తీర్చిదిద్దినట్లు తెలుస్తోంది.



ప్రదర్శనలో ఉంచిన ఇంజిన్ భాగాలు





అలంకరణ మొక్కలతో ఆకర్షణీయంగా..

నేడు తుపాను హెచ్చరికల కేంద్రం సందర్శనకు అనుమతి

మహారాణిపేట : ప్రపంచ వాతావరణ సంస్థ వజ్రోత్సవాలు సోమవారం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఏయూలో ఉన్న వాతావరణ కేంద్రం సందర్శనకు అనుమతి ఇచ్చారు. అలాగే ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు వాతావరణ పరికరాలు, నమూనాలు, చిత్రాలను ప్రదర్శిస్తున్నారు. కైలాసగిరిపై గల వాతావరణ కేంద్రానికి చెందిన డాప్లర్ వెదర్ రాడార్ కేంద్రం కూడా ప్రజా సందర్శనార్థం తెరిచి ఉంటుంది.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆంధ్ర మెడికల్ కళాశాల 1990 బ్యాచ్ విద్యార్థులు

బీచ్‌రోడ్డు : ఆంధ్ర మెడికల్ కళాశాల 1990 ఎంబీబీఎస్ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. పాతజ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ప్రస్తుతం వివిధ హోదాల్లో ఉన్న వారు ఆడుతూ పాడుతూ సరదాగా గడిపారు. ఈ బ్యాచ్‌కు చెందిన ప్రభుత్వ మానసిక ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.రామిరెడ్డి తదితరులు పాల్గొని క్లాస్‌మెంట్స్‌తో ముచ్చటించారు.

ఫుడ్ డెలివరీ బాయ్‌పై దాడి

- నిందితుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

ఎంవీపీకాలనీ: స్విగ్గీ ఫుడ్ డెలివరీ బాయ్ హరిదేవ సాయికుమార్‌పై దాడికి పాల్పడిన ఘటనలో సీతమ్మధార ఆక్సిజన్ టవర్స్‌లోని ఓ ఫ్లాట్(2914) యజమాని ప్రసాద్‌పై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలివి.. ఈ నెల 21వ తేదీ రాత్రి 11.15 సమయంలో ప్రసాద్ నెహ్రూబజార్‌లోని ఓ దుకాణంలో చేపలు ఆర్డర్ ఇచ్చాడు. దీంతో ఆ ఆర్డర్ అందుకున్న సాయికుమార్ పార్శిల్ స్వీకరించిన అనంతరం దాన్ని డెలివరీ చేసేందుకు ఆక్సిజన్ టవర్స్ బీ బ్లాక్‌కు చేరుకున్నాడు. అయితే ఇంటి బయట నంబర్ బోర్డు లేకపోవడంతో ఫ్లాట్‌ను కనుగొనేందుకు ఇబ్బంది పడ్డాడు. చివరికి నంబర్ లేని ఓ ఫ్లాట్ కాలింగ్ బెల్ కొట్టగా 25 ఏళ్ల వయసు గల పనిమనిషి తలుపు తీసింది. దీంతో ఇంటి నంబర్ 2914గా నిర్ధారించుకుని, అనంతరం పార్శిల్ అందజేశాడు. డెలివరీ కన్ఫర్మేషన్ ఫొటో తీసి అక్కడి నుంచి లిఫ్ట్ వైపు వెళ్లాడు. అయితే అతని వెనుక మరల ఆ పనిమనిషి వచ్చి తన యజమాని ప్రసాద్ మిమ్మలను వెనక్కి రమ్మన్నారని చెప్పడంతో.. తిరిగి అతను ఫ్లాట్ వద్దకు వెళ్లాడు. అయితే డెలివరీ ఇచ్చే సమయంలో పనిమనిషితో సరిగ్గా స్పందించలేదని ఆరోపిస్తూ ప్రసాద్ అతనిపై దాడికి పాల్పడ్డాడు. తర్వాత సాయికుమార్ కులం, ఊరు అడిగిన ప్రసాద్.. ఎస్సీ సామాజిక వర్గం అని తెలియడంతో కులం పేరుతో పలు రకాలుగా దూషించాడు. ఈ క్రమంలో సాయికుమార్ మెట్ల మార్గం ద్వారా వెళ్లిపోవడానికి ప్రయత్నించగా.. అతన్ని నిలువరించమని సెక్యూరిటీకి ప్రసాద్ ఆదేశించాడు. దీంతో ప్రసాద్ సాయికుమార్‌ని సెక్యూరిటీ రూమ్‌లోకి తీసుకెళ్లి చెక్కతో మరోసారి తీవ్రంగా కొట్టాడు. దుస్తులు విప్పించి దాడికి పాల్పడ్డాడు. అనంతరం సాయికుమార్ ఇష్టానికి విరుద్ధంగా ప్రసాద్ అతనితో రెండు లేఖలు కూడా రాయించుకున్నాడు. తర్వాత దుస్తులు ఇచ్చి బయటకు వెళ్లిపోవాలని ఆదేశించడంతో.. ఆక్సిజన్ టవర్స్ నుంచి బయటకు వచ్చిన తర్వాత సాయికుమార్ దుస్తులు వేసుకున్నాడు. అవమాన భారంతో కుంగిపోయిన సాయికుమార్ స్నేహితులతో చెప్పుకుని ఆవేదన వ్యక్తం చేశాడు. స్విగ్గీ నుంచి కాల్స్ వస్తుండటంతో మరిన్ని ఇబ్బందులు ఎదురవుతాయేమోననే భయంతో తన అత్త ఇంటికి వెళ్లిపోయాడు. అనంతరం గాయాలు తీవ్రంగా ఉండటంతో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స కోసం చేరాడు. ఈ ఘటనపై ఆదివారం ఎంవీపీ పోలీసు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయడంతో.. సీఐ మురళీ ఆధ్వర్యంలో పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.